- కిటకిటలాడిన స్వీట్స్, బేకరీ దుకాణాలు
- గిఫ్ట్, ఫ్రూట్స్ షాపుల వద్ద వినియోగదారుల రద్దీ
- డైరీలకు భలే గిరాకీ

నగరంలో న్యూ ఇయర్ హంగామా

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం నగరంలోని మార్కెట్‌లు కళకళలాడాయి. కొత్త సంవత్సరం తొలి రోజున శుభాకాంక్షలు తెలపడం ఆనవాయితీ. ఆ క్రమంలో అన్ని వర్గాల ప్రజానీకం కొత్త సంవత్సర ఆగమనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ముఖ్యంగా స్వీట్స్, కేక్‌లు, పండ్లను కొనుగోలు చేయడానికి పోటీ పడ్డారు. బేకరీ, స్వీట్స్, ఫ్రూట్స్ దుకాణాల వద్ద వినియోగదారుల రద్దీ కనిపించింది. అక్కడే ప్రత్యేకంగా కేక్‌ల విక్రయాలు ఏర్పాటు చేయడంతో వందల సంఖ్యలో వినియోగదారులు కొనుగోలు చేశారు. అలాగే కొత్త సంవత్సరం శుభాకాంక్షలు తెలిపే క్రమంలో నగర వాసులు పెద్ద మొత్తంలో స్వీట్స్‌ను కొనుగోలు చేశారు. ప్రధాన సెంటర్లలో దుకాణాలు కళకళలాడుతూ కనిపించాయి. నగరంలో నూతన సంవత్సర వేడుకలు అంబరాన్నింటాయి.

అర్ధరాత్రి వరకు జోష్

అలాగే కొత్త సంవత్సరం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేయడానికి గ్రీటింగ్స్‌ను, అలాగే పెద్దలను కలిసి అందజేయడానికి పండ్లను, చిన్నారులకు ఇవ్వడానికి గిఫ్ట్ ఆర్టికల్స్‌ను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతుండటంతో ఆయా దుకాణాలన్నీ కిటకిటలాడుతూ కనిపించాయి. ప్రధానంగా మార్కెట్‌లో ఆయా వస్తువులను విక్రయించే దుకాణాలన్నీ వినియోగదారుల రద్దీ నెలకొంది. డైరీలు విక్రయించే హోల్‌సేల్ దుకాణాల వద్ద వినియోగదారుల సందడి నెలకొంది. కొన్ని సంస్థలు ఆర్డర్లిచ్చి ప్రత్యేకంగా తయారు చేయించగా, మరికొన్ని సంస్థలు మార్కెట్‌లో సిద్ధంగా ఉన్న డైరీలను కొనుగోలు చేశాయి. వివిధ వర్గాల వారు వారివారి స్థాయిలో డైరీలను కొనుగోలు చేశారు. ఇళ్ల ముందు రంగవల్లులతో నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. ఆదివారం అర్ధరాత్రి కేక్‌లు కట్ చేసి, స్వీట్స్ పంచుకుని ఆనందోత్సాహాలతో గడిపారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు.


బీసెంట్ రోడ్డులో వినియోగదారుల రద్దీ


స్వీట్స్ కొనుగోలు చేస్తున్న నగర వాసులు


విక్రయానికి బొకేలు సిద్ధం


బేకరీలో కేకులు కొనుగోలు చేస్తున్న ప్రజలు


న్యూ ఇయర్ కేక్

ప్రత్యేక సిబ్బందితో నగర పరిశుభ్రతకు చర్యలు

మేయర్ రాయన భాగ్యలక్ష్మి


నగరంలో పర్యటిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ వుండ్కర్


నగరంలో చెత్త తరలింపును పర్యవేక్షిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, అధికారులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రత్యేక సిబ్బందితో నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ రత్నావళిని ఆదేశించారు. ఈ క్రమంలో మేయర్ భాగ్యలక్ష్మి ఆదివారం ఉదయం ఆర్టీసీ డిపో ఏరియా, 24వ డివిజన్ పరిధిలోని శాతవాహన కాలేజీ ప్రాంతం, 10వ డివిజన్ ఫన్‌టైమ్ క్లబ్ రోడ్, 3వ డివిజన్ కనకదుర్గానగర్ ప్రాంతాలను పరిశీలించారు. నగర వాసులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు సిబ్బందిని పెంచి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. నగర వ్యాప్తంగా 651 బ్లాక్ స్పాట్స్, లెగసీ వేస్ట్ పాయింట్స్‌ను గుర్తించామని మేయర్ తెలిపారు. కార్పొరేషన్, ప్రత్యేక పారిశుద్ధ్య సిబ్బంది విధుల్లో ఉన్నారన్నారు. మధ్యాహ్నం 12 గంటల కల్లా చెత్త తరలింపు వాహనాలతో దాదాపు 250కు పైగా ట్రిప్పులలో చెత్తను ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌కు తరలిస్తున్నారన్నారు.

నగర పరిశుభ్రతకు సహకరించాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): నూతన సంవత్సరంలో ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ వుండ్కర్ అధికారులు, సిబ్బందితో కలిసి రాత్రి వేళల్లోనూ నగర పరిశుభ్రతలో నిమగ్నమయ్యారు. శనివారం అర్ధరాత్రి సమయంలో నగర వ్యాప్తంగా పర్యటించారు. రోడ్లపై పేరుకుపోయిన చెత్తను జేసీబీ మెషీన్‌తో శుభ్రపరిచే కార్యక్రమాన్ని చేపట్టారు. రామలింగేశ్వరనగర్, ఏలూరు రోడ్, బీఆర్టీఎస్ రోడ్, సత్యనారాయణపురం, రామలింగేశ్వరపేట, ఎక్సెల్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో పేరుకుపోయిన చెత్తను అధికారులు, సిబ్బంది యుద్ధప్రాతిపదికన తొలగించి శుభ్రపరుస్తున్నారన్నారు. క్లాప్ వెహికల్స్ అందుబాటులో ఉంటాయని చెప్పారు. నగర పరిశుభ్రతకు ప్రజలందరూ సహకరించాలని కోరారు.

వైఎస్సార్ సీపీ క్లస్టర్ కమిటీల నియామకం

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని మూడు క్లస్టర్లకు పూర్తి స్థాయి కమిటీలను నియమించారు. వాటి వివరాలు ఇలా ఉన్నాయి

క్లస్టర్–1

అధ్యక్షుడిగా బుర్రి జగ్జీవన్‌రావు, ఉపాధ్యక్షులు బి.కోటేశ్వరరావు, జె.రత్నకుమార్, జనరల్ సెక్రటరీలు షేక్ షరీఫ్, టి.రాంబాబు, సీహెచ్ రవి, కోశాధికారిగా ఆర్.స్వాతిలను నియమించారు.

క్లస్టర్–2

అధ్యక్షుడిగా ఎండీ రిజ్వాన్, ఉపాధ్యక్షులు నెలకుదిడి శంకరరావు, అబ్దుల్ హన్నన్, జనరల్ సెక్రటరీలు తులిమిల్లి యశ్వంత్, తమ్మారెడ్డి ప్రకాష్, బేతాల సునీత, కోశాధికారి నాగవెంకటేశ్వర్లురెడ్డిలు నియమితులయ్యారు. క్లస్టర్ 1, 2 లకు మరో ఆరుగురు కార్యదర్శులు, తొమ్మిది మందిని కార్యనిర్వాహక సభ్యులుగా నియమించారు.

క్లస్టర్–3

అధ్యక్షుడిగా ఉమ్మడిశెట్టి బహదూర్, ఉపాధ్యక్షులు వై.రాజు, వినయ్‌రెడ్డి, జనరల్ సెక్రటరీలు కె.కామేష్, డి.గణేష్, కోశాధికారిగా పి.రమణారెడ్డిలను నియమితులయ్యారు. వీరితో పాటు ముగ్గురు కార్యదర్శులు, ఆరుగురు కార్యనిర్వాహక సభ్యులను నియమించారు.

ఒత్తిళ్లే సమస్యలకు కారణం



ఆటోనగర్(విజయవాడతూర్పు): మనసును నశింపచేయడమే అహంకారాన్ని వదలటమే యోగం.. ఆహాన్ని భగ్నం చేసేది జ్ఞానాగ్ని.. నవ్వుతూ జీవితాన్ని గడపడమే యోగం అని ఎం రఘుగురూజీ అన్నారు. వాసవ్య మహిళా మండలి సమావేశ మందిరంలో సమ భావనా మిత్రమండలి ఆధ్వర్యంలో ఆదివారం కోనేరు నరేంద్రబాబు అధ్యక్షతన ఆరోగ్యానికి వ్యక్తిత్వ వికాసానికి యోగా అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రఘు గురూజీ మాట్లాడుతూ.. మితాహారం అవసరమని.. 35 ఏళ్ల పాటు శరీరాన్ని కాపాడితే తర్వాత శరీరం మనల్ని కాపాడుతుందన్నారు. కార్యక్రమంలో టి.శోభనాద్రి, యార్లగడ్డ రంగారావు, సీహెచ్ వెంకటరెడ్డి, గుమ్మా సాంబశివరావు పాల్గొన్నారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు


దేవినేని అవినాష్

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ తూర్పు నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో ప్రజలకు అంతా మంచే జరగాలని కోరుకుంటున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల శ్రేయస్సే ప్రథమ ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో తూర్పు నియోజకవర్గ ప్రజలకు సేవలు అందిస్తున్నామని, నూతన సంవత్సరంలో కూడా నియోజకవర్గ ప్రజల సేవలో అనునిత్యం నిమగ్నమై ఉంటామన్నారు. 2023లో నియోజకవర్గంలో ఎన్నో సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని చేపట్టామని, రాబోయే సంవత్సరంలో మరింత ఉత్సాహంతో అంతకు మించి అభివృద్ధిని ప్రజలకు అందిస్తామని చెప్పారు. అందరికీ మంచి చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో ప్రజలు సంపూర్ణ మద్దతు తెలపాలని, మరలా వైఎస్ జగన్‌ను సీఎం చేసేందుకు అందరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

కార్మికులకు బియ్యం పంపిణీ



ఆటోనగర్(విజయవాడతూర్పు): నూతన సంవత్సరం సందర్భంగా లిడ్‌క్యాప్ చెప్పుల షోరూంలో పని చేసే కార్మికులకు లిడ్‌క్యాప్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్ బియ్యం బస్తాలను ఉచితంగా పంపిణీ చేశారు. 10 మంది కార్మికులకు ఒక్కొక్కరికి 25 కేజీల బియ్యం బస్తాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ పేదలకు సహాయం చేయడం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. లిడ్‌క్యాప్ చైర్మన్ సతీమణి షర్మిలా, వైఎస్ ట్రేడర్స్ అధినేత డి.ఆనంద్‌కుమార్, కార్మికులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత సామాజిక బాధ్యత


చెత్త తొలగిస్తున్న కార్పొరేటర్ రామిరెడ్డి, నాయకులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని 17వ డివిజన్ కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి అన్నారు. ఆదివారం రాణిగారితోట, 17వ డివిజన్‌లో ఆయన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పలు వీధుల్లో రోడ్లు ఊడ్చి శుభ్రం చేశారు. కుప్పలుకుప్పలుగా పేరుకుపోయిన చెత్త కుప్పలను క్లాప్ ఆటోలకు ఎత్తి తరలించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులు సమ్మె చేయడంతో డివిజన్‌లో పలు చోట్ల చెత్త పేరుకుపోయిందన్నారు. దీంతో దుర్వాసన వెలువడుతుండడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆ విషయం తన దృష్టికి రావడంతో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి రోడ్లు శుభ్రం చేసి, చెత్తను తొలగించామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కె.దామోదర్, కాశీం, నరసింహారెడ్డి, అయ్యపరెడ్డి, తిరుపతిరెడ్డి, జయలక్ష్మి, వెంకటస్వామి, సాయికృష్ణారెడ్డి, మోహిద్దీన్, రాజేష్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా గ్రీటింగ్ కార్డ్ కాంటెస్ట్

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): గాయత్రీనగర్‌లోని స్ఫూర్తి క్రియేటివ్ స్కూల్ ఆవరణలో ఆదివారం విద్యార్థులకు గ్రీటింగ్ కార్డ్ కాంటెస్ట్ ఆదివారం జరిగింది. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 60 మంది విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం విజేతలకు స్కూల్ డైరెక్టర్ శ్రీనివాస్ బహుమతులు అందజేశారు. స్కూల్ ప్రిన్సిపాల్ స్నేహ, చిత్రకారిణి రమ్య పోటీలను పర్యవేక్షించారు. విజేతలకు ప్రశంసాపత్రం, మెమోంటో అందజేశారు.